ప్రైవేట్ ఆసుపత్రుల్లో.. ఫీజుల పట్టికలను ఏర్పాటు చేయాలి 8లో..

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడి మృతి 7లో..



పల్లె దవాఖానాలో వైద్యుల కొరత

- నామమాత్రపు సేవలతో నెరవేరని లక్ష్యం
- జిల్లాలో 102 దవాఖానాలకు గానూ ఆరుగురు ఎంబీబీఎస్ వైద్యులు
- మిగిలిన వాటిల్లో ఇతర వైద్యులు, నర్సులతో కొనసాగింపు

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు దూర భారాన్ని తగ్గించి నాణ్యమైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా)లలో వైద్యుల కొరత నెలకొంది. గత ప్రభుత్వం గ్రామాల్లో గల పలు ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా ఏర్పాటు చేసింది. సంబంధిత పల్లె దవాఖానాలను ఇటీవల కేంద్రం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రా లుగా మార్పు చేసింది. సుమారు 3వేల నుంచి 5 వేల జనా భాకు ఒకటి చొప్పున ఏర్పాటు అయ్యాయి.ఒక్కో దవాఖానా లో ఒక్కో వైద్యాధికారి, ఇద్దరు ఏఎన్ఎంలతో పాటు ఆశా కార్యకర్తలు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రజలకు 12 రకాల వైద్య సేవలు అందాల్సి ఉంది. ఇంత వరకు బాగానే ఉన్నా..పలు దవాఖానాలకు వైద్యులు, సిబ్బంది లేకపోవడం తో వీటి లక్ష్యం నెరవేరడం లేదు.

● జిల్లాలో భారీగా వైద్యులు పోస్టుల ఖాళీ...

జిల్లా వ్యాప్తంగా పల్లె దవాఖానాల్లో భారీగా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 151 ఆరోగ్య ఉప కేంద్రాలుండగా గత ప్రభుత్వం 102 కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్చింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం సంబంధిత దవాఖానాలను ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లుగా మార్పు చేసింది. జిల్లా వ్యాప్తంగా పల్లె దవాఖానాల్లో కేవలం 6 గురు మాత్రమే ఎంబీబీఎస్ వైద్యులు పనిచేస్తున్నారు. మిగిలిన వాటిల్లో 24 మంది బీఏఎంఎస్ (బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసన్ అండ్ సర్జరీ), ఒకటి బీఎన్‌వైఎస్(బ్యాచిలర్ ఆఫ్ నాచురోపతి అండ్ యోగిక్ సైన్సెస్) వైద్యులు పనిచేస్తున్నారు. 60 మంది బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు పనిచేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎన్‌వైఎస్ వైద్యులు 35 మంది పనిచేస్తుండగా 60 వాటిల్లో నర్సులు మాత్రమే పనిచేస్తున్నారు. 7 కేంద్రాల్లో వైద్యులు గానీ, నర్సులు గానీ లేకుండా ఉన్నాయి. నిబంధనల ప్రకారం ప్రతి కేంద్రంలో వైద్యుడు పనిచేయాల్సి ఉంటుంది. పల్లె దవాఖానాల్లో పనిచేయడానికి వైద్యులు ముందుకు రాకపోవ డంతో నర్సులతో నెట్టుకురావాల్సిన పరిస్థితి తయారైంది.

● రూ. 16 లక్షలతో భవనాల నిర్మాణం..

గత ప్రభుత్వం పల్లె దవాఖానాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. చాలా ఆరోగ్య ఉప కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడంతో సొంత భవనాలు సమకూర్చడంపై సర్కారు దృష్టి సారించింది. ఇందులో భాగంగా 300 గజాల స్థలంలో రూ. 16 లక్షలతో అధునాతన సదుపాయాలతో భవనాలు నిర్మించాలని సంకల్పించింది. అందులో ప్రసూతి సేవలను అందించడానికి లేబర్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. పలు ప్రాం తాల్లో స్థల సమస్య కారణంగా పల్లె దవాఖా నాలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఆరోగ్య ఉప కేంద్రాల్లో గతంలో వ్యాధి నిర్ధారణ చేయలేని పరిస్థితి ఉండేది. జ్వరం, జలుబు, తలనొప్పి, విరేచనాలు వంటి చిన్న సమస్యలకే మందులు ఇచ్చే వారు. ఉప కేంద్రం పరిధిలోని వారు తీవ్రమైన అనారోగ్యం బారిన పడితే సమీపంలోని పీహెచ్‌సీకి, జిల్లా ఆసుపత్రికి పరుగెత్తాల్సిన పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో గత సర్కారు ఆరోగ్య ఉప కేం ద్రాలను పల్లె దవాఖానాలుగా మార్పు చేసి పక్కా భవ నాలను నిర్మించాలని సంకల్పించి నప్పటికీ పలు ప్రాంతాల్లో స్థల సమస్య కారణంగా లక్ష్యం నెరవేరడం లేదు.

● అందే సేవలు ఇవే..

పల్లె దవాఖానాల్లో గర్భిణులకు, పిల్లలకు బుధ, శని వా రాల్లో వైద్యాధికారి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. పిల్లలకు టీకాలు వేస్తారు. క్యాన్సర్, మధుమేహ, రక్తపోటు బాధితుల కు పల్లె దవాఖానాల్లో తగిన పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారు. వారంలో ఒక రోజు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పించడం తో పాటు పరీక్షలు నిర్వహిస్తారు. చిన్నారులకు, వృద్ధులకు ప్రత్యేక సేవలందిస్తారు. పల్లె దవాఖానా పరిధిలో కుటుంబ నియంత్రణ పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. చెవి, ముక్కు, గొంతు వ్యాధులకు, కంటి సమస్య లకు పరీక్షలు, చికిత్స అందించే ఏర్పాటు చేస్తారు. మానసిక ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి సంబంధిత ఆసుపత్రు లకు సిఫారుసు చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలన్నింటికి పల్లె దవాఖా నాల్లో అమలు చేయాల్సి ఉంటుంది.

సమస్యలు పరిష్కరించేందుకు దృష్టి సారిస్తాం

\- సమీయొద్దిన్, జిల్లా వైద్యాధికారి



జిల్లాలోని పల్లె దవాఖానాలు (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు దృష్టి సారిస్తాము. జిల్లా వ్యాప్తంగా పల్లె దవాఖానాల్లో గల వైద్యు ల ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. వైద్య ఆరోగ్య శాఖలో బది లీల ప్రక్రియ కారణంగా వైద్యుల నియామకం కాస్తా జాప్యం జరిగింది. వీలైనంత తొందరలో ఖాళీలను భర్తీ చేసేలా చర్యలు చేపడుతాము.

ఆంక్షలు లేకుండా రుణ మాఫీ చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు



జగిత్యాలలో ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి కొర్రీలు, ఆంక్షలు లేకుండా రైతు లందరికీ రుణ మాఫీ చేసే దాకా ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. జగిత్యాలలో తహసీల్ చౌరస్తాలో గల ఆర్డీవో కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌లతో కలిసి గురువారం ధర్నా నిర్వహించారు. రైతు రుణ మాఫీలో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సుమారు అరగంట పాటు నిరసన వ్యక్తం చేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం పట్టణంలోని దరూర్ క్యాంప్‌లో గల బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉన్న తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రూ. 2 లక్షల రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు తగిన న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ నాయకులను, ప్రభుత్వాన్ని వెంటపడి నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్‌రావు, నియోజకవర్గం లోని ఆయా మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

డీఎంహెచ్‌వో సమీయొద్దిన్

జగిత్యాలరూరల్, ఆగస్టు 22 : రోగుల నుంచి అధిక ఫీజులు వసూల్‌చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సమియొద్దీన్ అన్నారు. ప్రైవేట్ హాస్పిటళ్ల వైద్యులు రోగుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదు మేరకు జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడు తూ ప్రైవేట్ హాస్పిటళ్లు నిబంధనలు అతిక్రమించరాదన్నారు. రోగులకు నాణ్యమైన సేవలు అందించాలన్నారు. రోగులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు . అధిక ఫీజులు వసూలు చేస్తు చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో జిల్లావైద్యశాఖ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయాన్ని నిర్వీర్యం చేసిన ఘనత కేసీఆర్‌దే

కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల/మెట్‌పల్లి, ఆగస్టు 22(ఇబ్రహీంపట్నం): గత ప్రభుత్వంలో వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. రైతు ప్రభుత్వానికి కేరాఫ్ కాంగ్రెస్ ప్రభుత్వమని, రాష్ట్రంలో, నియో జకవర్గంలోని అర్హులైన ప్రతి రైతుకు 2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందని నర్సింగరావు అన్నారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి రైతుకు రెండు లక్షల రుణమాఫీ అవుతుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథ కాలను చూసి ఓర్వ లేక బీఆర్ఎస్ నాయకులు రుణమాఫీపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నాయకులు రైతులను తప్పుదోవ పట్టించి రుణమాఫీ పై రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల అర్బన్, ఆగస్టు 22: జిల్లాలోని బీసీ నిరుద్యోగ యువతకు ఉపాధి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన కులాల అభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. హైదరాబాద్‌లోని కుషాయిగూడలో ఎలీ హోప్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వంద మంది అభ్యర్థులకు 90రోజుల పాటు నాన్‌రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత అకాడమీ ఆధ్వర్యంలోనే ఉద్యోగాలు కల్పిస్తారని, శిక్షణ కాలంలో నెలకు 4వేల రూపాయలు భృతిని సంస్థ అందిస్తుందన్నారు. పదోతరగతి, ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన 18-25ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పదోతరగతి మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందన్నారు. వివరాలకు 0878-2268686 నెంబర్‌కు సంప్రదించాలన్నారు

మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మెగాస్టార్ చిరంజీవి అభిమానులు

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కృష్ణానగర్‌లో గల బ్రేక్ డాన్స్ స్టూడియోలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను గురువారం అభిమానులు ఘనంగా నిర్వహించారు. చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్, జగిత్యాల ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో మెగా అభిమానులు వేడుకలు జరిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి మిఠాయి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్, ప్రజా సేవా సమితి అధ్యక్షుడు ఎండీ పాషా, నాయకులు నాగుల శ్యామ్, పులి నాగరాజు, వొద్నల రాజేశ్, కస్తూరి వెంకటరమణ, అలిశెట్టి అర్జున్, ఉదయ్, సాయి, వెంకటేశ్, ప్రసాద్ పాల్గొన్నారు.

మల్యాల: ప్రముఖ సినీ నటుడు, మాజీ ఎంపీ చిరంజీవి జన్మదిన వేడుకలను మండల చిరంజీవి అభిమాన సంఘం అధ్యక్షుడు దూడం రామాంజనేయులు ఆధ్వర్యంలో మల్యాల బ్లాక్ చౌరస్తా వద్ద గల సోనియాగాంధీ గుడి ముందు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

లింగంపేట రైల్వేస్టేషన్ తనిఖీ చేసిన డీఆర్ఎం

జగిత్యాలరూరల్, ఆగస్టు 22 : జిల్లా కేంద్రంలోని లింగంపేట రైల్వేస్టేషన్‌ను గురువారం సికింద్రాబాద్ డివిజన్ రైల్వే మేనేజర్ భర్తేష్ కుమార్ జైన్ తనిఖీ చేశారు. గురువారం పెద్దపల్లి- నిజామాబాద్‌మార్గంలోని వివిధ రైల్వేష్టేషన్ల తనిఖీల్లో భాగంగా మార్గమధ్యలోని లింగంపేట రైల్వేస్టేషన్ తనిఖీ చేశారు. ఆయన వెంట లింగంపేట స్టేషన్ సూపరిండెంట్ వామనేశ్వర్‌దేవ్ ఉన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో..

మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలి

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నూకపల్లి శివారులో గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాల్సిన అవసరముందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో కలెక్టర్ సత్యపసాద్, అదనపు కలెక్టర్ రాంబాబులతో కలిసి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల పనులపై రెవెన్యూ, హౌజింగ్, పంచాయతీ రాజ్, మిషన్ భగీరథ, విద్యుత్, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ మాట్లాడారు. నూకపల్లి వద్ద నిర్మాణమవుతున్న 4,520 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు, గతంలో కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లకు తాగునీటి సౌకర్యం కోసం రూ. 14 కోట్లు నిధులు మంజూరు అయ్యాయన్నారు. మురికికాలు వలు, విద్యుత్, రహదారి అభివృద్ధి పనులకు రూ. 18 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. సంబంధిత పనులను ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 4,520 ఇళ్లలో 3,700 ఇళ్లు గతంలో లబ్ధిదారులకు కేటాయించగా, మిగిలిన 800కు పైగా ఇళ్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకున్న వారికి గానీ, నూతనంగా పట్టణంలో రేషన్ కార్డు ఉన్న వారికి అవకాశం కల్పించి మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు ప్రక్రియ జరపాలన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. అనర్హులు లేకుండా అర్హులకు అందించేలా చూడాలన్నా రు. అంతార్గ గ్రామంలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు విద్యుత్, రహదారులు, మురి కాలువల నిర్మాణాలపై అధికారులతో చర్చించారు. పట్టణంలోని బీట్‌బజార్‌లో రూ. 4 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ నిరుపయోగంగా ఉందని, వినియోగంలోకి తేవాలన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ సత్య ప్రసాద్

నూకపల్లి వద్ద గల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కాలనీలో మౌలిక వసతుల కల్పన పనులను వేగవంతంగా పూర్తి చేయడంలో అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అన్నారు. కాలనీలో పేరుకపోయిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని ఆదేశించారు. లబ్ధిదారులకు కేటాయించకుండా మిగిలిన ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. మీ సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించుటకు మీ సేవా రాష్ట్ర కమిషనర్ అనుమతి తీసుకొని ప్రక్రియ ప్రారంభించాలన్నారు. జిల్లా అధికారులచే టీమ్‌లు ఏర్పాటు చేసి అర్హులైన లబ్ధిదారులను రెండు మాసాల్లోగా ఎంపిక చేయాలని తెలిపారు. నూకపల్లి కాలనీకి వెళ్లే రహదారి ఆక్రమణను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్‌డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, ఈఈలు సంపత్ రావు, రెహమాన్, శేఖర్ రెడ్డి, డీఈలు రాజేశ్వర్, మిలింద్, జలందర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

కలెక్టర్ సత్యప్రసాద్

వెల్గటూర్ , ఆగస్టు 22: విద్యార్థుల విద్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ వేయించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. ఆదేశించారు. గురువారం వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గురుకుల పాఠశాలను జగిత్యాల ఆర్డీవో మదుసూదన్‌తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ గురుకుల పాఠశాలను మొత్తం సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలగు రించి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా గు రుకుల పాఠశాలకు కాంపౌండ్ వాల్, టాయిలెట్లకు డోర్లను, మెస్ డోర్స్, చిన్న చిన్న మరమ్మతులను చేయించాలని అధికారులకు సూచించారు. డైనింగ్ హాల్ షెడ్ నిర్మాణానికి ఎస్టిమేషన్ సమర్పిస్తే నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే సమయం కాబట్టి జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్, టీచర్లతో విద్యార్థుల విద్యా, ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దు

ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాలరూరల్, ఆగస్టు 22 :విదేశాల్లో ఉద్యోగాల ఉపాధి కోసం వెళ్లేవారు నకిలీ ఏజెంట్లను ఆశ్రయించి మోసపోవద్దని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్‌లో గురువారం గల్ఫ్‌మోసాల నివారణ, పాటించాల్సిన నియమాల గురించి పోలీస్ శాఖ, ప్రొటెక్టర్ ఆఫ్ ఎమిగ్రాంట్స్ హైద్రాబాద్ మినిస్ట్రీ ఆఫ్ ఎక్సటర్నల్ ఎఫైర్స్ వారి ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గల్ఫ్ ఏజెన్సీలు అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చే కంపెనీల వివరాలు, జీతబత్యాలు, ఇతర సమాచారాన్ని అభ్యర్థులకు సరిగా తెలపాలని సూచించారు. ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లు యువకులు ప్రభుత్వ లైసెన్స్ గల ఏజెన్సీల ద్వారా మాత్రమే వీసాను పొందాలని సూచించారు. గల్ఫ్‌కి వెళ్లే నిరుద్యోగ యువకులు అత్యవసర సమయంలో హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1800113090 లేదా7428321144వాట్సాప్‌ద్వారా సంప్రదించి సందేహాలను నివృత్తం చేసుకోవాలన్నారు. లైసెన్స్‌లేని ఏజెంట్లు తక్షణమే లైసెన్స్‌ను పొంది నిబంధనలకు లోబడిపనిచేయాలని సరైన వీసా డాక్యుమెంట్స్‌లేనిది నిరుద్యోగ యువతను గల్ఫ్‌దేశాలకు పంపించకూడదన్నారు. ఈసందర్భంగా ఇమిగ్రేషన్ అధికారులు ఇమిగ్రేషన్ యాక్ట్ నియమనిబంధనల గురించి వివరించారు ఈకార్యక్రమంలో డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రవీంద్రకుమార్, సీఐలు, ఎస్సై లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 22: దేశంలో మహిళలపై లైంగిక దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్న తరుణంలో మహిళా రక్షణకై చట్టాలను పగడ్బంధీగా అమలు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ బాధ్యులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కలకత్తా వైద్యవిద్యార్థిని అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాహుల్, అక్షయ్, మావిజ్, జియా, అయాన్, మనోజ్, రిషి, సమీద్, షాజాద్ తదితరులున్నారు.

గౌడకుల సంఘాల సంక్షేమానికి కృషి

జగిత్యాలరూరల్, ఆగస్టు 22 : గౌడకులసంఘాల అభివృద్ధి, సంక్షేమం తన ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామంలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహప్రతిష్టాపన, అన్నదానం కార్యక్రమానికి ఎమ్మెల్యే గురువారం ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌడసంఘం అభివృద్ధికి రూ. 4లక్షలు నిధులు మంజూరు చేశానని తెలిపారు. నాయకులు రవీందర్‌రెడ్డి, గంగారెడ్డి, రవి, హరీష్, శేఖర్, గౌడసంఘం అధ్యక్షుడు మల్లేశంగౌడ్, గౌడసంఘంసభ్యులు పాల్గొన్నారు

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22: కరీంనగర్ అశోక్‌నగర్‌లో బుధవారం వేకువ జామున జరిగిన హత్య కేసులో నిందితుడు మీర్జా ఇబ్రహీం బేగ్ అలియాస్ మీర్జా సుఫియాన్ బేగ్(20)ని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. మద్యం విషయంలో గొడవ పడి అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ ముజాయిద్‌ఖాన్(32)పై సిమెంట్ ఇటుకతో దాడి చేసి హత్య చేశాడు. దీంతో కోర్టు ఆదేశాలతో నిందితుడు సుఫియాన్‌బేగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సరిలాల్ తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా మలేరియా వైద్యాధికారి

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా మలేరియా వైద్యాధికారి ఉమాశ్రీరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు.ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన జ్వరంతో బాధపడుతున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తాడికల్‌లో జ్వరాల బారిన పడిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి రోగ లక్షణాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణల పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించారు. పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



క్షేత్ర స్థాయి పర్యటనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 22: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ బృందం ఆధ్వర్యంలో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. పత్తిలో ఆకుమచ్చ తెగులు, పిండినల్లి, రసం పీల్చే పురుగుల ఉధృతిని గుర్తించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారి చేయాలని, రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్లాప్రైడ్ 0.3మిల్లీలీటరు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పిండినల్లి నివారణకు ప్రోఫెనోఫాస్ 3 మి.లీ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరిలో మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జీ గుళికలు 4 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. వరిలో జింక్ లోపానికి 2గ్రా. జింక్ సల్ఫేట్, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నలో ఆకుమాడు తెగులు నివారణకు ప్రోపి కోనాజోల్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు గోన్యానాయక్, బలరాం, రవి, శ్వేత, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ కో ఆర్డినేటర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఆయా జిల్లాల రైతులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన బస్సు

- బయటకు నెట్టిన నాయకులు


బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు

వీర్నపల్లి, ఆగస్టు 22: మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షాలకు ప్రధాన రహదారి బురద మయంగా మారింది. రోడ్డంతా బురదతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వన్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బురదలో దిగబడిపోయింది. దీంతో ప్రయాణికులు బస్సులో నుంచి దిగారు. అక్కడే రైతు ధర్నా పాల్గొనేం దుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు బస్సును వెనకనుంచి నెడుతూ బురదలో నుంచి బయటకు తీశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోమండల ప్రజలు బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాపట్టించుకునే వారు లేరని వాపోయారు.

తండాల్లో తీజ్ వేడుకలు


బావ్‌సింగ్‌నాయక్ తండాలో తీజ్ వేడుకలు నిర్వహిస్తున్న స్థానికులు

వీర్నపల్లి, ఆగస్టు 22: పలు తండాల్లో గురువారం తీజ్ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో గిరిజన యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీర్నపల్లి మండలంలోని బావ్ సింగ్ నాయక్ తండా, మద్దిమల్ల తండా, భూక్యతండా, జవహర్లాల్ నాయక్ తండా గ్రామాలతో పాటు పలు తండాల్లో గిరిజనులు తీజ్ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్‌నాయక్ మాట్లాడుతూ తండాల్లో పెళ్లికాని ఆడపడుచులు పందిరి వేసి బుట్టలలో ఆవు ఎరువు వేసి నవధాన్యాలను నానబెట్టడం సాంప్రదాయమ న్నారు. మొలకెత్తిన నారు బుట్టలకు ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అనంతరం గిరిజనులు డప్పు చప్పుళ్ల మధ్య సాంప్రదాయ నృత్యాలతో నిమజ్జనం చేస్తారన్నారు. తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, ఆయా తం డాల్లో తండా నాయక్‌లు, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు బుగ్గరాజేశ్వరతండా, కిష్టునాయక్‌తండా, తిమ్మాపూర్ తండా, గుంటపల్లిచెరువు తండాల్లో గురువారం సాయంత్రం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పందిరిని ఏర్పాటు చేసి గిరిజన యువతులు వారం రోజుల పాటు ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తిశ్రద్ధలతో గోధుమ బుట్టల్లో నీరు పోశారు. చివరి రోజున గోధుమ బుట్టలను పందిరి నుంచి తీసి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగించారు. సాంప్రదాయ పాటల మధ్య నృత్యాలు చేశారు. అనంతరం సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ సర్పంచులు రజిత, ప్రభునాయక్, తండా పెద్దలు తిరుపతినాయక్, సీత్యానాయక్, సూర్యనాయక్, హరిదాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.


బుగ్గరాజేశ్వరతండాలో గోధుమనారు బుట్టలతో యువతులు

క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న దీపక్ జాన్ రాజ్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 22: క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ రాజ్ అన్నారు. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో కరీంనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా పాస్టర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దీపక్ జాన్ రాజ్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో మైనారిటీ విద్యార్థుల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఉచిత స్కాలర్‌షిప్‌లు, మైనారిటీ హాస్టళ్లలో వసతిని అందిస్తున్నామని అన్నారు. క్రైస్తవుల స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందిస్తు న్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక భేటీ అనంతరం తదుపరి కార్యాచరణను తెలియజేస్తామని అన్నారు. క్రైస్త వులపై జరుగుతున్న దాడులకు కొంతమంది న్యాయవాదులచే ఓ కమిటీని ఏర్పాటు చేసి దురాగతాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. క్రైస్తవ సమాజానికి ఒక నిధిని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిం చాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలి పారు. సిఎస్ఐటీఏ ఆల్ ఇండియా బెన్సి షరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి కృపాదానం మాట్లాడుతూ గ్రామీణ యువతీ యువకులకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కింద ఉపాధి అవకాశాల విషయంలో స్పందించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక విద్యా బోధన కార్యక్రమం కింద స్టడీ సర్కిళ్ళు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం క్రిష్టఫర్, కార్యదర్శి ఏ సురేశ్, విపిఎస్ బాల నాయక్, ప్రేంకుమార్, పాలు ముస్తఫా, మున్సిపల్ అడిష నల్ కమిషనర్ సువార్త, ప్రసాద్, పాస్టరేట్ చైర్మన్ పాల్ కొమ్మాలు, కార్యదర్శి సిహెచ్ దేవదాసు, ఓ పవన్, అశోక్, శ్యామ్, రాజు, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు

▸▸ రోడ్డుపైనే ఆర్టీసీ బస్సును నిలిపివేసిన డ్రైవర్

హుజూరాబాద్, ఆగస్టు 22: పరిమితికి మించి ప్రయాణికులు బస్సు ఎక్కారని, తాను నడపలేనంటూ ఓ ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుపై బస్సును నిలిపివేశాడు. వివరాలిలా ఉన్నాయి. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం వరంగల్‌కు వెళ్తూ మధ్యలో ఉండే హుజూరాబాద్ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ పెద్ద ఎత్తున ప్రయాణికులు బస్సులో ఎక్కారు. ఓవర్ లోడ్ అవుతుందని, బస్సును నడిపే పరిస్థితి ఉండదని డ్రైవర్ ఎంత చెప్పినా ప్రయాణికు లు వినిపించుకోలేదు. బస్సును కిలోమీటర్ నడిపిన డ్రైవర్ ఇక నడపడం తన వల్ల కాదని చెప్పి రోడ్డుపై నిలిపివేశాడు. ఆ సమయంలో బస్సులో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. రియర్ వ్యూ మిర్రర్ నుంచి ఇతర వాహనాలు తనకు కనిపించడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే తనను బాధ్యుడిని చేస్తారని, తాను బస్సు నడప లేనని ప్రయాణికులకు చెప్పాడు. బస్సులోని ప్రయాణికులు తనకు సహకరించి దిగి పోవాలని అభ్యర్థించాడు. దీంతో కొంత మంది ప్రయాణికులు డ్రైవర్ చెప్పి న విషయాన్ని గమనించి బస్సు దిగిపోయారు. దీంతో యథావిధిగా బస్సు వరంగల్‌కు వెళ్లిపోయింది. గురువారం పెళ్లిళ్లు ఉండడంతో బస్సులో రద్దీ ఎక్కువగా ఉంది.


హుజూరాబాద్‌లో రోడ్డుపై నిలిపివేసిన ఆర్టీసీ బస్సు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి
కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 9064 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,994, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5072 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసె క్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 433 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీలోకి 4,472 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరు తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 4,472 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 22: లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 17.6 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ చిరువ్యాపారి మృతి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లికి చెందిన ఎండి ఖాజా (55) అనే చిరువ్యాపారి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శుక్రవారం రాత్రి తన ఇంటిలో పురుగుల మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు..

మానకొండూర్, ఆగస్టు 22: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన పిట్టల ప్రవీణ్ (33) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి గురువారం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రవీణ్ గతంలో కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ చిట్‌ఫండ్‌లో ఉద్యోగం చేస్తూ అప్పులు చేయగా వాటిని తీర్చేందుకు తన తండ్రికి చెందిన భూమివాటాను అమ్మి అప్పులు చెల్లించిన తీరలేదు. అప్పుల భాద భరించలేక ఈ నెల 17న రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా మృతుని తండ్రి సారయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, ఆగస్టు 22: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మజ్జిగ కొంరయ్య(90) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం.. కొంరయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంరయ్య కుమారుడు బీరయ్య గురువారం ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి, ఆగస్టు 22: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమండ్ల తిరుపతి(50) కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆరు నెలల క్రితం యాక్సిడెంట్ అయ్యి ఇంటివద్దనే ఉంటున్నాడు. దీంతో ఇంటి వద్ద భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. తీవ్ర మనస్తాపం చెందిన తిరుపతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయబావిలో జారిపడి
మహిళా రైతు మృతి


సంతోషి మృతదేహం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 22: సిరిసిల్ల పట్టణం ముష్టిపల్లి గ్రామానికి చెందిన చీమ సంతోషి(26) అనే మహిళా రైతు గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో జారిపడి మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. ముష్టిపల్లి గ్రామానికి చెందిన సంతోషి వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో బావిలో నీళ్లు ఉన్నాయని గడ్డపై నుంచి చూస్తుండగా గడ్డి జారీ బావిలో పడింది. ప్రమాదవశాత్తు బావిలో పడుతుండగా పక్కనే మరోమహిళా రైతు ఉంది. వెంటనే చూసిన ఆ మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి బావిలో పడిన మహిళా రైతును పైకి తీసి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి భర్త మహేశ్ ఉపాధి కోసం నెలరోజుల క్రితమే దుబాయ్ వెళ్లాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని దివ్యాంగుడు..

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్ రైల్వే స్టేషన్, 35వ, రైల్వే గేటు మధ్యలో గుర్తుతెలియని దివ్యాంగుడు రైలు నుంచి పడి మృతిచెందాడు. ఈ సంఘటన ఎప్పుడు జరిగిందనేది స్పష్టంగా తెలియడం లేదు. దీంతో మృతదేహం చీమలు, కుక్కల పాలవుతోందని రైల్వే కార్మికులు విలేకరులకు తెలిపారు. గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దివ్యంగుడైన ఈ వ్యక్తి బూడిద కలర్‌షర్ట్ గీతాల డబ్బాలతో ఉన్న చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రైలు నుంచి పడి మృతిచెంది ఉంటాడని కొలనురు గ్రామస్తులు తెలిపారు. వెంటనే జీఆర్పీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హత్య ఘటనపై సీఐ విచారణ


కొలనూర్‌లో విచారణ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్‌లో బుధవారం రాత్రి జరిగిన మాటూరి విజయ్ హత్య స్థలం వద్ద గురువారం సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐల బృందం సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహించారు. బుధవారం రాత్రి మద్యం బెల్టు షాపులో ఒక వ్యక్తితో గొడవ జరగగా బయటకు వచ్చిన తర్వాత ప్రణాళికంగా హత్య జరిగిన తీరుపై సీఐ దర్యాప్తు నిర్వహించారు. అక్కడున్న నెత్తుటి నమూనాలను, హత్య జరిగిన తీరుపై నిందితుడితో జరిగిన వాగ్వాదంపై అక్కడి బెల్టుషాప్ యజమానిని విచారించారు. సిఐ వెంట ఎస్సైలు శ్రీధర్, నరేష్ కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి ఆరెల్లి సారయ్య అనే వ్యక్తి గురువారం ఉదయం కాలినడకన పోలీస్ స్టేషన్ వైపు వెళ్తున్న సమయంలో కేశవపట్నం వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఎడమ కాలు విరిగింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 205క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర 6,900 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడు మృతి

- నిశ్చితార్థానికి కొద్ది గంటల ముందే మృత్యువాత


సాధిక్(ఫైల్)

కథలాపూర్, ఆగస్టు 22: మరి కొద్ది గంటల్లోనే నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు అతివేగంగా బైక్ నడిపి చెట్టుకు ఢీకొట్టి మృత్యువాత పడ్డ ఘటన పోసానిపేటలో విషాదం నింపింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. సాధిక్ (29) అనే యువకుడు ఏడు సంవత్సరాల అనంతరం ఈ నెల 11న దుబాయి నుంచి వచ్చాడు. సాధిక్ బుధవారం సాయంత్రం తాండ్ర్యాలకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. గురువారం తెల్లవారుజాము దాకా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి రోడ్డు వెంట వెతుకుతూ వెళ్లారు. పోసానిపేట ఎల్లమ్మ శివారులో చెట్టుకు ఢీకొట్టుకుని పక్కనే ఉన్న గోతిలో శవమై కనిపించాడు. సాధిక్‌కు గురువారమే వరపూజ ఉండగా అనూహ్యంగా మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి అన్న అన్వర్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సింగరేణి కార్మికుడి మృతి

- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి' కథనం


పొత్కపల్లి మూల మలుపు వద్ద ఢీకొన్న వాహనాలు , (ఇన్‌సెట్‌లో మృతి చెందిన రంజిత్‌కుమార్(ఫైల్))

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లి చెరువు మూలమలుపు వద్ద గురువా రం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీకి చెందిన పెంద్రు రంజిత్ కుమార్ అలియాస్ రఘు(39) అనే సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. అత్తగారి గ్రామమైన జీలకుంటలో తన కొడుకు బారసాల ఉండగా మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంతో వస్తుండగా, జమ్మికుంట నుంచి సుల్తానాబాద్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు పొత్కపల్లి ఊర చెరువు మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రంజిత్ కుమార్ తీవ్ర గాయాలకు గురికాగా సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇప్పటివరకు పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా, ఈనెల 13న, పొత్కపల్లి చెరువు మూలమలుపుపై 'ఆంధ్రజ్యోతి'లో మూలమలుపు వద్ద పొంచి ఉన్న ముప్పు అనే కథనం ప్రచురితమైంది. అయినప్పటికీ అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదం సంభవించి తన కొడుకును కళ్లారా చూసుకోక ముందే సింగరేణి కార్మికుడు దుర్మరణం చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గన్నేరువరం, ఆగస్టు 22: మండల కేంద్రంలో రెండు ద్విచక్రవాహనాల ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి(60) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి ద్విచక్రవాహనం (ఏపీ15ఏ25560)పై సోమవారం గన్నేరువరం వచ్చి వెళుతున్న క్రమంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఎదురుగా గన్నేరువరం గ్రామానికి చెందిన బుర్ర రాజ్‌కోటి బైక్ (టీఎస్02ఈబి7263) ఢీకొట్టినట్లు ఎల్లస్వామి కూతురు వనజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే బుర్ర రాజ్‌కోటి తహసీల్దారు కార్యాలయం ఎదుట తన బైక్‌ను రోడ్డు పక్కన పెట్టుకుని ఉండగా మైలారం గ్రామస్థుడు కాదసి ఎల్లస్వామి తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎల్లస్వామికి తలకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీజీఎం

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భారతీష్ కుమార్ జైన్ గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ జరుగుతున్న రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారంలు, స్టేషన్‌ను పరిశీలించారు. పెద్దపల్లి నుంచి నిజామాబాద్, కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ సెక్షనలలో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ఉపాధ్యక్షుడు అజయ్ క్రాంతి సింగ్, కమిటీ సభ్యుడు దేవి సింగ్ ఠాకూర్ డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి- కరీంనగర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును నిజామాబాదు వరకు పొడిగించి వారానికి ఐదు రోజులు నడపడాలని, కరీంనగర్ నుంచి సికింద్రాబాద్‌కు వందే మెట్రో ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని, నిజామాబాదు నుంచి వరంగల్‌కు మెము ఎక్స్‌ప్రెస్ పుష్ పుల్ రైలు వయా పెద్దపల్లి మీదుగా నడపాలని, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక రైళ్లను పునరుద్ధరించడంతో పాటు వాటిని వారానికి మూడు రోజులు పెంచాలని కోరారు. పెద్దపల్లి, బల్లార్షా మీదుగా కోల్‌కతాకు నూతన రైలు సర్వీసు నడపాలని, పూర్వ నాగపూర్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించి చర్లపల్లి టెర్మినల్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.


డీఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న ఫోరం సభ్యులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల, ఆగస్టు 22: పట్టణంలోని అతి పురాతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో శ్రీలక్ష్మీదేవి, విష్వక్సేన, ఆంజనేయ, ద్వార పాలక రాజగోపుర శిఖర, విమాన వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు చక్రపాణి మాధవాచార్య, చక్రపాణి నరసింహమూర్తి, బీర్నంది నరసింహచారి మత్రోచ్చారణ మధ్య సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అన్నప్రసాదం స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కాంగ్రెస్ సీని యర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్, కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి - ప్రభాకర్, ఎంబేరి నాగభూషణం, పెండం గణేష్, ఆడెపు కమల - మధు, దేవాలయ ఈవో విక్రం, సీనియర్ అసిస్టెంట్ నర్సయ్య, నాయకులు జక్కుల ప్రసాద్, కొత్త సురేష్, గండ్ర అజేందర్‌రావు, జుబర్తి రమేశ్, వేంకటేశ్వర భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు


గణపతి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, ఆగస్టు 22: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తం గా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. సకల కష్టాలు తొలగిపోవాలని కోరుతూ అర్చకులు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాథ్‌శర్మ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం


కోరుట్ల జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే, రైతులు

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్


కోరుట్ల, ఆగస్టు 22 : రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ఆరోపించారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రైతులతో కలిసి రైతు ధర్నా కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. అంబేడ్కర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేసారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడారు. రుణమాఫీకి సంబంధించిన ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రభుత్వం రైతులకు చేస్తూ వ్యతిరేకతను వివరిస్తున్నట్లు తెలిపారు. ఒక వైపు సీఎం రేవంత్ రెడ్డి రెండు లక్షల వరకు రుణమాఫీ అవుతుందని ప్రకటించినప్పటికీ మంత్రులు మాత్రం ఇంకా రుణ మాఫీ పూర్తికాలేదని అనడం విడ్డూరమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, రైతు సమన్వయ కమిటీ జిల్లా మాజీ అధ్యక్షుడు చీటి వెంకటరావు, న్యాయవాది బైరీ విజయ్, కౌన్సిలర్ పేర్ల సత్యం, బట్టు సనిల్‌లతో పాటు వివిధ గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

అబద్ధాలు చెప్పి అధికారం చేపట్టిన రేవంత్‌రెడ్డి

ధర్మపురిలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

ధర్మపురి: అబద్ధాలు చెప్పి అధికారం చేపట్టిన సీఎం రేవం త్‌రెడ్డి రైతులను మోసం చేశాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వ ర్ ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వంగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు రైతులందరికి ఎలాంటి ఆంక్షాలు లేకుండా రుణమాఫీ చేయాలనే డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చి ఒక్కటి కూడ నెరవేర్చకుండా రైతులను మభ్య పెట్టి మోసం చేసిందన్నారు. ఓట్ల కోసం అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి రైతాంగాన్ని దగా చేశారన్నారు. సీఎం ఒక మాట, డిప్యూటీ సీఎం ఒక మాట, మంత్రులది ఒక మాట, అధికారులది ఒక మాట వల్ల రైతులు గందరగోళ పరిస్థితుల్లో ఉన్నారని ఆయన ఆగ్రహం వ్య క్తం చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ నిజాయితీగా చేయవచ్చని కాని ఆ నిజాయితీ వారిలో కనబడటం లేదని విమర్శించారు. దమ్ముంటే హరీష్‌రావు రాజీనామా చేయాలనే రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పినందుకు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధులను రైతుకు ఇవ్వకుండా వాటిని తిరిగి రుణమాఫీ కోసం మళ్లింపు చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాయ చేస్తుందన్నారు. రైతులకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి ఆందోళనలు ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. అంతకు ముందు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ రుణమాఫీ మోసంపై బీఆర్ఎస్ రణం, ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికి రుణమాఫీ చేయా లంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూల మాల వేసిన కొప్పుల ఈశ్వర్ భారీ సంఖ్యలో కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మాజీ ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, మాజీ జడ్పీటీసీ గోస్కుల జలంధర్, భీమయ్య, నియోజకవర్గ స్థాయి మండలాల అధ్య క్షులు మొగిలి శేఖర్, రాంచందర్‌గౌడ్, మహేష్, ఆకుల రాజేష్, బుచ్చిరెడ్డి, బల రాంరెడ్డి, అక్కెనపెల్లి సునీల్‌కుమార్, సయ్యద్ ఆసిఫ్, బారతపు గుండయ్య సంగి శేఖర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు, పాల్గొన్నారు.

మల్యాల: ఎలాంటి అంక్షలు లేకుండా ప్రతి రైతుకు పూర్తి స్థాయిలో రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మాజీ జడ్పీటీసీ కొండపల్కుల రామ్మోహన్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ బి.మధుసూధన్‌రావు నాయకులు పాల్గొన్నారు


ధర్మపురిలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి

గురుకుల డిప్యూటీ సెక్రెటరీ సీఎస్ ప్రసాద్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 22 : విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని గురుకుల డిప్యూటీ సెక్రెటరీ సీఎస్ ప్రసాద్ కోరారు. గురువారం పెద్దపూర్ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు విచ్చేసిన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ పాఠశాలకు 90 పడక మంచాలు వచ్చాయని, మెస్‌డోర్లకు కిటికీలను బిగిస్తామని, మరో వంద పడక మంచాలు రానున్నట్లు ఆయన తెలిపారు. అంతే కాకుండా పరిసరాలను పరిశుభ్రంగా చేసి నూతన భవనంలో కరెంటు మూత్రశాలలు, మరుగుదొడ్లను సిద్ధం చేయడమే కాకుండా సీసీ కెమెరాలను ప్రహరీ గోడకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మృతి చెందిన విద్యార్థుల పోలస్టుమార్టం నివేదిక బయటపెట్టాలని అప్పుడే తమకు నమ్మకం కలుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఉన్నతాధికారులు మరోసారి సమావేశం నిర్వహించి అన్ని విషయాలను తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ యూసుఫ్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

పెగడపల్లి, ఆగస్టు 22 : మండలంలోని బతికెపల్లిలో గురువారం ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో హోమియోపతి వైద్యశాల ప్రాంగణంలో డాక్టర్ వినయ కుమారి పాల్గొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు మధుమేహం రక్తపోటు, కీళ్ల నొప్పులు వాటి సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోమియోపతి వైద్యశాల ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నిఖిల్ రెడ్డి, డిపిఎం శివకుమార్, ఫార్మాసిస్టు శ్రీనివాస్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

సౌదీలో గుండెపోటుతో మృతి


మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 22 : మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్ గ్రా మానికి చెందిన అల్లె రామస్వామి(47) సౌదీలో గుండెపోటుతో మృతి చెందాడు. రామస్వామి జీవనోపాధి కోసం గల్ఫ్‌బాట పట్టాడు. సౌదీలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనులు చేస్తున్నాడు. ఈ నెల 17న కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా ఒక్కసారి కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. ఇప్పటికే మూడు సార్లు దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఉపని సరిగా లేకపలోవడంతో మళ్లీ సౌదీకి వెళ్లాడు. అయినా సౌదీలో పని వేతనం సరిగా లేవంటూ కుటుంబీకులతో చెబుతూ మనోవేదనకు గురవతుండేవాడని కుటుంబ సభ్యులు వెల్లడించారు. మృతుడు రామస్వామికి భార్య, ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

'విద్యతో మూఢనమ్మకాలు దూరం'

పెగడపల్లి, ఆగస్టు 22 : విద్యతోనే మూఢనమ్మకాలు దూరం అవుతాయని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేష్ పేర్కొన్నారు. మండలంలోని బతికెపల్లిలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు గంజాయి - మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో నరేష్ మాట్లాడుతూ మూఢ నమ్మకాలను వదిలి పెట్టి శాస్త్రీయ సమాజ నిర్మాణానికి నడుం బిగించాలని , దొంగ స్వాములు భూత వైద్యులు ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని ఆర్థికంగా సామాజికంగా మోసం చేస్తున్నారని అన్నారు. మాంత్రికులు, భూత వైద్యులు మోసం చేసే కుట్రలను సైన్స్ మ్యాజిక్ షో ద్వారా విద్యార్థులకు వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలను వివరించారు. హెచ్.ఎం. భారతి, పంచాయతీ కార్యదర్శి నిఖిల్‌రెడ్డి ఉన్నారు.

అనారోగ్యంతో వైద్యుడి మృతి

కోరుట్ల పట్టణంలో విషాదం


వైద్యుడు విజయ్ కుమార్

కోరుట్ల, ఆగస్టు 22 : పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు విజయ్ కుమార్ గురువారం ఉదయం హైదరాబాదులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యుడి మృతితో పట్టణంలో విషాదం ఏర్పడింది. కర్ణాటకకు చెందిన డాక్టర్ విజయ్ కుమార్ 30 సం వత్సరాల నుంచి కోరుట్ల పట్టణంలో వైద్య సేవలను అందించి పట్టణ ప్రజలకు సుపరిచితుడుగా ఉన్నారు. విజయ్ కుమార్ జనరల్ ఫిజీషియన్ కాగా అతడి భార్య సురేఖ స్త్రీల వైద్య నిపుణురాలు. వీరి కుమారులు కూడ వైద్యులుగా పట్టణంలో సేవలు అందిస్తున్నారు. కాగా డాక్టర్ విజయ్ కుమార్ మృతితో ఐఎంఐ సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. హైదరాబాదులో మృతి చెందిన విజయ్ కుమార్‌ను ప్రత్యేక వాహనంలో కోరుట్ల పట్టణంలోని అతని స్వంత ఇంటికి చేర్చారు. సాయంత్రం సమయంలో పట్టణంలోని వైకుంఠ దామంలో హిందూ సాంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలను జరిపారు.

జిల్లా యూత్ బాస్కెట్ బాల్ జట్ల ఎంపిక

జగిత్యాల అర్బన్, ఆగస్టు 22: మహబూబ్‌నగర్‌లో ఈ నెల 25,26 తేదీలలో జరగనున్న రాష్ట్ర స్థాయి యూత్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లలో పాల్గొనేందుకు జిల్లా నుంచి బాల, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు విశ్వప్రసాద్, అజయ్‌బాబు, కృష్ణప్రసాద్, విద్యాసాగర్, రాజ్‌కుమార్, లక్ష్మణ్, శశి, మంగ, విజ్ఞాన్, సామంత్, శ్రీరామ్, హరీష్‌లున్నారు.

కూడలి ఏర్పాటుపై నెలకొన్న వివాదం


భజరంగ్, బీజేపీ కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎస్‌పీ ఉమామహేశ్వర్ రావు

కోరుట్ల, ఆగస్టు 22 : పట్టణంలోని కల్లూర్ రోడ్డు కూడలిలో చౌరస్తా ఏర్పాటుపై వివాదం నెలకొంది. పురపాలక సంఘ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను చేపట్టి అందులో దివంగత మాజీ మంత్రి రత్నాకర్ రావు విగ్రహం ఏర్పాటు చేసేందుకు పనులను చేపట్టగా ఆ ప్రాంతంలో చత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ భజరంగ్ దళ్, బీజేపీ శ్రేణులు శివాజీ చిత్ర పటం పెట్టి పూజలకు పూనుకోవడంతో వివాదాస్పదంగా మారింది. కొన్ని రోజుల నుంచి భజరంగ్ దళ్, బీజేపీ శ్రేణులు కల్లూర్ రోడ్డు సర్కిల్‌లో శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి, కలెక్టర్ సత్యప్రసాద్‌లకు వినతి పత్రాలను అందించారు. ఈ విషయంలో మున్సిపల్ ఆధ్వర్యంలో కలూర్ రోడ్డు చౌరస్తాలో సర్కిల్ నిర్మాణానికి పనులను చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న భజరంగ్ దళ్, బీజేపీ, బీజేవైఎం శ్రేణులు శివాజీ చిత్ర పటంతో అక్కడకు చేరు కొని చిత్రపటం ఏర్పాట చేసి పూజలను మొదలు పెట్టారు. విషయం తెలసుకున్న మెట్‌పల్లి డీఎస్‌పీ ఉమామహేశ్వర్‌రావు నేతృత్వంలో మెట్‌పల్లి సీఐ కోరుట్ల ఇన్‌చార్జి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో కోరుట్ల, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు తన సిబ్బందితో అక్కడ చేరుకుని ఏర్పాట్లను అడ్డుకున్నారు. దీంతో బీజేపీ, భజరంగ్, బీజెవైఎం శ్రేణులు పోలీసుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఎట్టకే లకు డీఎస్పీ, సీఐ వారిని వారించి అక్కడి నుంచి వెల్లగొట్టే ప్రయత్నం చేసారు. విషయం తెలుసుకున్న కమిషనర్ తిరుపతి అక్కడి వచ్చి పనులను తాత్కాలికంగా నిలిపి వేయడంతో అంతా శాంతించారు. అక్కడ ఏర్పాటు చేసిన శివాజీ చిత్రపటాన్ని పోలీసులు, అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఈ విషయంపై కమీషనర్‌ను వివరణ కోరగా గత మార్చి 11వ తేదీన జరిగిన మున్సిపల్ పాలక వర్గ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం చేసిన అనంతరం కలెక్టర్ అనుమతితో చౌరస్తా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కూడలిలో అభివృద్ధిలో భాగంగా కల్లూర్ సర్కిల్‌లో మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు విగ్రహం ఏర్పాటుకు తీర్మానం జరిగినట్లు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాల తనిఖీ


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే

కొడిమ్యాల, ఆగస్టు 22 మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాలను గురువారం చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయాల్లోని ఉద్యోగుల వివరాలను ఎంపీడీవో, స్వరూప, తహసీల్దారు రాజమణిలను అడిగి తెలుసుకున్నారు. కార్యాలయాల్లోని గదులను పరిశీలించారు. నూతన తహసీల్దారు కార్యాలయం నిర్మాణం చేపట్టాలని తహసీల్దారు ఎమ్మెల్యేను కోరారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. అధికారులు, ఉద్యోగులు కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ విధులు నిర్వహించాలని సూచించారు. రుణమాఫీ విషయంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండ చూడాలని ఏవో జ్యోతికి సూచించారు. ఎమ్మెల్యే వెంట కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ముత్యం శంకర్, సిబ్బంది ఉన్నారు.

నిల్వ ఉంచిన మాంసం వాడితే కఠిన చర్యలు

మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్

మెట్‌పల్లి, ఆగస్టు 22(ఇబ్రహీంపట్నం): హోటల్ నిర్వాహకులు మాంసం ఫ్రీడ్జ్‌లలో నిల్వ ఉంచి వాడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో మున్సిపల్ సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయా వార్డులలో పారిశుధ్య పనులను చేపట్టారు. మురికి కాలువలను శుభ్రం చేసి దోమల బెడద నివారణకు ఫాగింగ్ మిషన్‌లతో స్ప్రే చేశారు. నీటి నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి అయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మోహన్ మాట్లాడుతూ రెస్టారెంట్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లలో నాణ్యతా ప్రమాణాలు పాటించ కుండ నడిపిస్తే రోజు దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.

మాంసం నిల్వ ఉంచి మరుసటి రోజు వాడితే తనిఖీలు నిర్వహించి జారిమానాలు విధించాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు వాడకుండ జ్యూట్ బ్యాగులు వాడాలని కోరారు. మెట్‌పల్లి మున్సిపల్ పట్ట ణాన్ని స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతా మని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ఇంజనీర్ విష్ణు, సిబ్బంది ముజీబ్, అశోక్ పాల్గొన్నారు.

నేడు బ్లాక్ డే పాటించాలి

సీపీయస్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు

జగిత్యాల అర్బన్, ఆగస్టు 22: పాత పెన్షన్ పునరుద్ధరణకోసం ఆగస్టు 23ను బ్లాక్‌డే గా పాటించాలని రాష్ట్ర సీపీయస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో స్టేట్ సీపీయస్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన కొత్తలో పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ నుంచి తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులకు సీపీఎస్‌ను కొనసాగిస్తారా, పాత పెన్షన్ పునరుద్ధరిస్తార అనే లేఖకు అనాటి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండానే సీపీఎస్ విధానంలోనే కొనసాగిస్తామని 2014 ఆగస్టు 23న జీవో నెం 28ద్వారా ఉత్తర్వులు ఇచ్చి తెలంగాణ ఉద్యోగులను నిండా ముంచిందన్నారు. అందుకే ఆగస్టు 23ను బ్లాక్‌డే పాటిస్తూ నిరసనలకు పిలుపునిచ్చామన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక భారం లేని సీపీఎస్ విధానం రద్దుచేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మ్యాన పవన్‌కుమార్, సర్వ సతీష్, గొల్లపల్లి మహేష్ గౌడ్, బోగ శ్రీనివాస్, జనార్ధన్, వీరబత్తిని శ్రీనివాస్, బండారి సతీష్ తదితరులున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఫీజుల పట్టికలను ఏర్పాటు చేయాలి

జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ నీలారపు శ్రీనివాస్


ఆసుపత్రిని పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్

కోరుట్ల, ఆగస్టు 22 : ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఫీజుల పట్టికలను ఏర్పాటు చే యాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ నీలారపు శ్రీనివాస్ ఆసుపత్రి నిర్వాహ కులకు సూచించారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులను జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ ఆకస్మితికంగా తనీఖీ చేసారు. ఆసుపత్రిలలో జరుగు తున్న వైద్యం గురించి వివిధ వ్యాధులతో చేరిన వారిని అడిగి తెలుసుకున్నారు. విష జ్వరాల బారిన పడిన వారికి అంది స్తున్న వైద్య గురించి సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఫీజుల నియంత్రణ జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

మెట్‌పల్లి రూరల్: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సునీల్‌కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎంటమాలజీ నాగయ్యలు అన్నారు. గురువారం మండలంలోని వెల్లుల్ల, జగ్గాసాగర్ గ్రామాల్లోని పలు కాలనీల్లో వైద్య సిబ్బందితో సందర్శించారు. నీరు నీల్వ ఉన్న ప్రాంతాలతో పాటు అపరిశుభ్రంగా ఉన్నటువంటి ప్రాంతాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా నివారణ చర్యలపై ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ముందస్తు చర్యలు తీసుకోవాలని జాగ్రత్తలపై పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, విలాయత్‌బేగ్, అచ్యుతరావు, శ్రీనివాస్, రమేశ్, ప్రభావతి ఆరోగ్య కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

మల్లాపూర్ : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని మల్లాపూర్ ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ముత్యంపేట, దాంరాజ్‌పల్లి గ్రామాల్లో గురువారం పీహెచ్‌సి వైద్యురాలు వాహినిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాలను ఆయన సందర్శించారు. ఆయన స్థానికులకు పలు సూచనలు చేశారు. రెండు గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఎంపీవో జగదీష్, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

గొల్లపల్లి: మండలంలోని శ్రీరాములపల్లె గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్థుల నుంచి భారీ స్పందన లభించింది. మండల వైద్యాధికారి నరేష్ వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్వాతి, హెల్త్ అసిస్టెంట్ వేణుగోపాల్, ఏఎన్ఎంలు దేవేంద్ర, పుష్పలత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


జగ్గాసాగర్‌లో నీటి నిల్వ ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జోనల్ మలేరియా అధికారి

సంక్షిప్తం సమాచారం

మెట్‌పల్లి, (ఇబ్రహీంపట్నం): గల్ఫ్‌లో మ రణించిన అల్లె రామస్వామి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ప్రవాసీల మిత్ర లేబర్ యూనియన్ యూఏఈ దుబాయ్ అధ్యక్షుడు బత్తిని రాజగౌడ్ కోరా రు. గురువారం ఆయన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కొడిమ్యాల : విద్యార్థి దశ నుంచి అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఆర్థిక అక్షరాస్యత కౌన్సిలర్ కోట మధు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిపించారు. విద్యార్థి దశ నుంచి పొదుపు చేయటం, ఆర్థిక క్రమ శిక్షణ అలవర్చుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు సత్యానందం, జగదీష్ పాల్గొన్నారు.

●మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఇస్కాన్ మెటుపల్లి ప్రెజిడెంట్ శ్రీమాన్ డా.. నరహరిదాస్, శ్రీ శ్రీరాధా గోవర్ధన ధారి మందిరం వారి సౌజన్యంతో గురువారం రాత్రి మండల కేంద్రంలో ముందస్తు కృష్ణాష్టమి వేడులకు ఘనంగా నిర్వహించారు.

కోరుట్ల : సెప్టెంబర్ 1వ తేదీన కోరుట్ల పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘ ఎన్నికలు నిర్వహి స్తున్నట్లు ఎన్నికల అధికారులు అందే శివప్రసాద్, బోగ శ్రీధర్ కుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 23 నుంచి 24 వరకు నామినేషన్ల దాఖలు కార్యక్రమం ఉంటుందని 25వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తామన్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులతో పాటు వివిధ పోస్టులకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బుగ్గారం: మండలలంలోని గోపులపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కొమ్మినేని నారాయణ రెండు రోజుల క్రితం గుండె పోటుతో మరణించగా వారి కుటుంబాన్ని గురువారం మాజీ మంత్రి కొ ప్పుల ఈశ్వర్ పరామర్శించారు. అనంతరం బుగ్గారం మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న మండల గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌ డ్ పరామర్శించారు.

●మండల కేంద్రానికి చెందిన తాజ మాజీ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ జంగ శ్రీనివాస్ మండల కేంద్రంలో తన స్వంత డబ్బుతో బస్ షెల్టర్ నిర్మాణ పనులు చేపట్టారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు.

రాయికల్: ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద భూమి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ తెలిపారు. ప్రజలు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన రశీదుతో పాటు రిజిస్ట్రేషన్ పత్రాల జిరాక్స్‌లు తీసుకుని మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

●మండలంలోని భూపతిపూర్ గ్రామానికి చెందిన సోమ శ్రైలాస్యకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రతిభా పురస్కారం అందజేశారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో 982 మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు శ్రైలాస్యకు ప్రశంసాపత్రం, రూ.10 వేల నగదును అందజేశారు.

●రాయికల్ పట్టణంలోని బస్టాండ్ నుంచి గాంధీ చౌరస్తా వరకు రోడ్డు మీదకు వచ్చి అక్రమంగా వేసుకున్న షెడ్లు, తోపుడు బండ్లను గురువారం మున్సిపల్ అధికారులు తొలగించారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో గురువారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా జగిత్యాలకు చెందిన ప్రముఖ కంటివైద్యులు మృదులారెడ్డి పాల్గొని విద్యార్థులకు ఉచితకంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

భీమారం: మండలంలోని కమ్మరిపేట గ్రామంలో జూనియర్ లైన్‌మెన్‌గా పని చేస్తున్న కొత్తూరి సురేష్‌కు అసిస్టెంట్ లైన్‌మెన్‌గా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా సురేష్‌ను గ్రామానికి చెందిన రైతులు, గ్రామస్థులు గురువారం మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

మొక్కలు నాటిన అధికారులు

మల్యాల, ఆగస్టు 22: నాటుదాం ఒక చెట్టు-అమ్మ పేరు మీద కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాల్లో గురువారం మొక్కలు నాటారు. ఒక్కో గ్రామంలో సుమారు 200వరకు మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. ఎంపీడీవో స్వాతి, గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న విద్యార్థులు